క్లుప్తంగా

'రాజ్యాధికారం సాధించాలి'



కామారెడ్డి టౌన్: సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించడం కోసమే తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ వైస్ చైర్మన్ వడ్డేపల్లి రామకృష్ణ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ నుంచి బీసీలనే ముఖ్యమంత్రిని చేస్తామని, తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేస్తామని తీర్మానించామన్నారు. పార్టీ విస్తరణలో భాగంగా ఈనెల 16న కామారెడ్డిలో బహిరంగ సభను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పార్టీ కన్వీనర్ సిర్నాపల్లి శ్రీహరి, నాయకులు పాండు యాదవ్, మానేటి కష్ట, సుధాకర్ ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ఎల్లారెడ్డి: పట్టణంలోని జెడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సురేష్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంఈవో వెంకటేశం తదితరులున్నారు.

ఉత్తమ పీపీగా ఎంపికైన రమేశ్‌కు సన్మానం



భిక్కనూరు: ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికైన కామారెడ్డి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్‌ను భిక్కనూరు మండల కేంద్రంలో ముదిరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత నంద రమేశ్ మాట్లాడుతూ.. ఎవరికి ఏ న్యాయ సహాయం కావల్సి ఉన్నా తనను సంప్రదించాలని సూచించారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి



బాన్సువాడ రూరల్: స్వగ్రామం పోచారంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించే సీతారామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను విజయవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం సతీమణి పుష్పమ్మ, గ్రామ సర్పంచ్ పరిగె రాధ, సోదరుడు శంభురెడ్డి, కుమారుడు సురేందర్‌లతో కలిసి ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేవాదాయ శాఖ నిధులతో ఆలయాన్ని నిర్మించామన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. నాయకులు గంగుల గంగారాం, విజయ్‌గౌడ్, గణేష్ పాల్గొన్నారు.

గోల్డెన్ టీచర్ అవార్డు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దేవాగౌడ్ మంగళవారం నేషనల్ గోల్డెన్ టీచర్ అవార్డు- 2023ని అందుకున్నారు. ఈ సందర్భంగా దేవాగౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫర్‌ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు తనకు ఈ అవార్డును ఆన్‌లైన్ ద్వారా అందించినట్లు తెలిపారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డుకు తనని ఎంపిక చేసిన ఫర్‌ఫెక్ట్ ఎడ్యుకేషన్ సొసైటీ వారికి హృదయ ధన్యవాదాలు తెలిపారు.

సిందూర పూజలు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవుడి ఆలయంలో శ్రావణమాస మంగళవారం సందర్భంగా కాలభైరవుడికి జలాభిషేకాలు, సిందూర పూజలు నిర్వహించారు. శ్రావణమాసం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్ పాల్గొన్నారు.

పీఈటీలపై వివక్ష ఎందుకు ?

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో వ్యాయామ ఉపాధ్యాయులపై వివక్ష ఎందుకు చూపుతున్నారని మండల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహిస్తున్నారు. 8, 10 సంవత్సరాలుగా వ్యాయామ ఉపాధ్యాయులను ఉత్తమ పీఈటీలుగా ఎందుకు గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలోని అన్ని మండలాల్లో గుర్తిస్తున్నా... లింగంపేట మండలంలోనే ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. పీఈటీలు జావిద్అలీ, రాజు, ప్రియాంక, సంగారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, సన్మానాలు



జిల్లా గ్రంథాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అదనపు కలెక్టర్ మను చౌదరి



డీఈవో చేతుల మీదుగా .. మహిపాల్



లింగంపేట మండల ఉత్తమ ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులు అందజేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు ప్రశంసా పత్రాలు అందజేసి వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయులే సమాజానికి మార్గ నిర్దేశకులని వ్యాఖ్యానించారు. భావిభారత పౌరులను తయారు చేయడంలో వీరి పాత్ర కీలకమన్నారు. అలాగే పలు పాఠశాల్లో స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారిని పాఠాలు బోధించారు. భారత రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. – సాక్షి, నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎంఈవో



కిష్టాపూర్ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న తోటి విద్యార్థులు



పద్మాజివాడి శివారు పాఠశాలలో ..



దేశాయిపేట్‌లో ఉపాధ్యాయుడికి సన్మానం



దోమకొండలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్



మాచారెడ్డి: సోమారంపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున విద్యార్థులు



దోమకొండలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకుంటున్న నీరడి సాయన్న

విద్యార్థుల్ని ప్రయోజకులను చేసేది గురువులే

- ఎమ్మెల్యే సురేందర్



గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులను ప్రయోజకులను చేసేది ఉపాధ్యాయులేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజా ల సురేందర్ అన్నారు. మండల కేంద్రంలో హరాళే గార్డెన్స్‌లో నిర్వహించిన గురుపూజోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శంకర్ నాయక్, స్థానిక సర్పంచ్ సంజీవు పాల్గొన్నారు.

పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష

- వాడి వేడిగా రామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం
- సమస్యలను ఏకరువు పెట్టిన సర్పంచులు, ఎంపీటీసీలు



సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): రామారెడ్డి మండల సర్వసభ సమావేశం ఎంపీపీ దశరథ్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం రైతు వేదికలో వాడి వేడిగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వివిధ శాఖల పురోగతిపై సమీక్షించారు. గత సమావేశానికి హాజరుకాని అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, ఎంపీడీవో విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరవడం కావడం లేదని, గత సమావేశంలో చర్చించిన అంశాలపై పురోగతి లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతు రుణమాఫీ డేటా ఏవో దగ్గర లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ నెలలో కురిసిన వర్షాలకు ఎంతమంది రైతులకు పంట నష్టపరిహారం వచ్చిందని ఎమ్మెల్యే సురేందర్, ఏవోను హరీష్‌కుమార్‌ను ప్రశ్నించారు. గ్రామాల్లోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేకు విద్యుత్ సమస్యలపై ఏకరువు పెట్టారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు వెడల్పు పనులు అటవీ శాఖ నుంచి అనుమతులు రాగానే పూర్తి చేస్తామని ఆర్అండ్బీ డీఈ శ్రీనివాస్ సభ్యులకు తెలిపారు. ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ.. కేవలం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనే 4,500 మందికి పోడుపట్టాలు ఇచ్చామని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని, సర్వసభ్య సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను విజయ్ కుమార్‌ను ఆదేశించారు. వైస్ ఎంపీపీ రవీందర్, జెడ్పీటీసీ మోహన్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ శాలిని, తహసీల్దార్ రోజా పాల్గొన్నారు.

'ప్రభుత్వ సొమ్ము గంగపాలు'



ఇళ్ల వద్ద మాట్లాడుతున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో బీఆర్ఎస్ నేతలు ముందు చూపు లేకుండా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మింపజేసి ప్రభుత్వ నిధులను నీటి పాలు చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన రామేశ్వర్‌పల్లిలో చెరువు నీటిలో మునిగిన డబుల్‌బెడ్‌రూము ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులోనే ఇళ్లను నిర్మించి ప్రభుత్వ నిధులను వృథా చేశారని విమర్శించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈ స్థలాన్ని ఎంపిక చేసిన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

అయ్యప్ప ఆలయానికి విరాళం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.50వేలను విరాళంగా అందజేసినట్లు వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం వివిధ రకాల పనులు చేపట్టడానికి దాతలు సహకరించాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు.

గాంధారిలో 1,400 ఎకరాల్లో పంట నష్టం

గాంధారి(ఎల్లారెడ్డి): మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో పంటలు బాగా దెబ్బ తిన్నాయి. వరదల కారణంగా సుమారు 1,400 ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏవో నరేష్ తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం వరి 791 ఎకరాల్లో, సోయాబీన్ 248 ఎకరాల్లో, పత్తి 225 ఎకరాల్లో, మొక్కజొన్న 145 ఎకరాల్లో నష్టపోయినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు పెట్టుకోని, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆపరేషన్‌కు బాల్యమిత్రుల సాయం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కిడ్నీ పాడైన బాధితుడికి బాల్యమిత్రులు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. లింగంపేట మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన అల్లం రవికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంది. రవి స్నేహితులు రూ. 15 వేల నగదు అందించారు. కిడ్నీ పాడైన వ్యక్తికి ఇంకా దాతలెవరైనా ఆర్థిక సహాయం చేయాలని వారు కోరారు. స్నేహితులు విద్యాసాగర్, శ్యాం, సుభాష్, వేణు, రఫిక్ తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత



రాజంపేట: బస్వన్నపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన బాణాల మల్లారెడ్డి తన మనవడు మిథ్వాన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం 'ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

పంటలో అంతరకృషి చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంటలో అంతర కృషి చేసుకోవడం ద్వారా పంట పెరుగుదల బాగా ఉంటుందని ఏవో నదీమ్ తెలిపారు. మంగళవారం చిన్న దేవిసింగ్ తండా, టికారం తండా శివారులో పత్తి, సోయా పంటలను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

కాంట్రాక్టు అధ్యాపకుల దీక్షలు ప్రారంభం

భిక్కనూరు: తమ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ నేత బాలు మాట్లాడారు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయకపోవడం సరికాదన్నారు. కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణగుప్త, డాక్టర్ యాలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్టు అధ్యాపకులతో నివేదన సభ

భిక్కనూరు: సౌత్ క్యాంపస్‌లో బుధవారం(నేడు) రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులతో ఉద్యోగాల రెగ్యులరైజేషన్ కోసం సీఎంకి నివేదన సభను ఏర్పాటు చేసినట్లు కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సభలో రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు సరిత, వైశాలి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అచ్చయ్యపల్లికి బీటీ రోడ్డు వేయించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చయ్యపల్లి గ్రామస్తులు మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామంలో రాస్తారోకో చేశారు. అచ్చయ్యపల్లి గ్రామానికి బీటీ రోడ్డు లేకపోవడంతో ప్రయాణానికి ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఎల్లారెడ్డి- మెదక్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. గ్రామస్తులు చేస్తున్న ధర్నాకు కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపారు.

టైమ్ స్కేల్ ఇవ్వాలని నిరసన



భిక్కనూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని, టైమ్ స్కేల్, హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ కార్యాలయం ముందు గంట పాటు నిలబడి తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని నినదించారు. సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో తమపై జాలి చూపాలని కోరారు.

బీసీ సింహగర్జన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ: ఈ నెల 10న నిర్వహించే బీసీ సింహగర్జన వాల్‌పోస్టర్లను మంగళవారం బాన్సువాడలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నిఖిల్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని, అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించాలని కోరారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ సింహగర్జనకు అన్ని జిల్లాల నుంచి బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గోకులాష్టమి వేడుకలకు సిద్ధం

భిక్కనూరు: జంగంపల్లిలోని బ్రహ్మజ్ఞాశ్రమంలో గోకులాష్టమి వేడుకలను ఈనెల 7న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బ్రహ్మజ్ఞానాశ్రమం చైర్మన్ రంగు హన్మగౌడ్, తెలిపారు. జడకొప్పులాట, అన్నదానం, ఉట్టికొట్టు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు చెప్పారు.

సమస్యలను పరిష్కరించాలని ఆశాల వినతి



డోంగ్లీలో వినతి పత్రమిస్తున్న ఆశాలు



మత్తమాల పీహెచ్‌సీ ఎదుట నిరసన

మద్నూర్(జుక్కల్): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ డోంగ్లీ పీహెచ్‌సీ ఎదుట వైద్య అధికారికి ఆశావర్కర్లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. పనిభారం తగ్గించి జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్వాలిటీతో కూడిన ఐదు పెండింగ్ యూనిఫామ్స్ వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే ఇతర డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మత్తమాల పీహెచ్‌సీ ముందు ఆశా వర్కర్లు మంగళవారం ధర్నా చేశారు. పీఆర్‌సీ ఏరియర్స్‌తో పాటు, కరోనా అలవెన్సులను అందించాలని కోరారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ శరత్‌కు వినతిపత్రం అందించారు.

వరద ఉధృతికి తెగిన బ్రిడ్జి



యాచారంలో తెగిన బ్రిడ్జి



అంతంపల్లిలో నీట మునిగిన శ్మశానవాటిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): యాచారం జీపీ పరిధిలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో వరద ఉధృతికి బ్రిడ్జి తెగిపోయింది. బ్రిడ్జిని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ మోహన్‌లు పరిశీలించారు.

నీట మునిగిన శ్మశానవాటిక

భిక్కనూరు: అంతంపల్లిలోని శ్మశానవాటిక వర్షాలకు మంగళవారం నీట మునిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు ఎర్రకుంటలో చేరిన నీరు శ్మశాన వాటికకు చేరింది.

పాక్షికంగా కూలిన ఇల్లు

రాజంపేట: భారీ వర్షాల కారణంగా మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం ఉదయం భారీ వర్షం కురవడంతో రాజంపేట నుంచి తలమడ్ల వెళ్లే మార్గంలోని లోలెవల్ వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలలో వరి పంట నీట మునిగింది. రాజంపేట మండల కేంద్రంలోని కాసం శ్యామల ఇల్లు పాక్షికంగా కూలింది.



రాజంపేటలో నీట మునిగిన వరి పంట

దెబ్బతిన్న రోడ్లు



బేగంపూర్ చౌరస్తా, బేగంపూర్ రోడ్డుపై వరద నీరు



మనసారామ్ తండాకు వెళ్లే మార్గం..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు తండాలల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. బూరుగుపల్లి నుంచి మనసారామ్ తండాకు వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. కంకర తేలిపోయి అధ్వానంగా తయారైంది. అలాగే బేగంపూర్ చౌరస్తా, బేగంపూర్ మధ్యలో రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

పశువైద్యాధికారి డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి



మేనూర్‌లో మాట్లాడుతున్న సర్పంచ్ విఠల్

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ పశువైద్యాధికారిగా పని చేసిన బండివార్ విజయ్ డిప్యుటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని సర్పంచ్ విఠల్ గురూజీ డిమాండ్ చేశారు. మేనూర్ జీపీలో మంగళవారం ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పశువుల కాపరులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ విఠల్ గురూజీ మాట్లాడుతూ..పశువైద్యాధికారిని ఎలాంటి కారణం లేకుండా బీర్కూర్ మండలం రైతు నగర్‌కు డిప్యుటేషన్‌పై పంపించడం ఏమిటని ప్రశ్నించారు. డిప్యుటేషన్ రద్దు చేయాలని లేకుంటే నిరసన చేపడతామని హెచ్చరించారు.

సీపీఎస్ రద్దు చేయాలని స్పీకర్‌కు వినతి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ వల్ల ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని, పదవీ విరమణ, మరణానంతరం కుటుంబాలకు భద్రత లేకుండా పోతుందని వివ రించారు. ఉద్యోగుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, సీఎంతో చర్చిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.